# తెలంగాణ తిరుమలలో వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే పోచారం

## భక్తులకు ఉచిత రవాణా సదుపాయం వినియోగించుకోవాలని పిలుపు

బాన్సువాడ, బతుకమ్మ :బాన్సువాడ నియోజకవర్గంలోని బీర్కూర్ మండలం తిమ్మాపూర్ గ్రామ శివారులో ఉన్న తెలంగాణ తిరుమల తిరుపతి దేవస్థానంలో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి కుటుంబ సమేతంగా వెంకటేశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాన్సువాడ ఆర్డీవో రవీందర్ రెడ్డి కూడా స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్తగా ఉన్న పోచారం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, దేవస్థానానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ తరపున ఉచిత రవాణా సదుపాయం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా దూర ప్రాంతాల నుంచి వచ్చే వృద్ధులు, మహిళలు, వికలాంగులు, చిన్నారులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా కొండ కింద నుంచి కొండపై ఉన్న దేవాలయం వరకు ఉచిత వాహన సేవలు అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. ఈ సదుపాయంపై భక్తుల్లో అవగాహన కల్పించేందుకు పోచారం



స్వయంగా వాహనాన్ని నడిపిస్తూ కొండ కింద నుంచి పైకి, తిరిగి పై నుంచి కిందకు మొత్తం నాలుగు ట్రిప్పులు నిర్వహించి భక్తులను చేరవేశారు. ఈ సందర్భంగా భక్తులతో మాట్లాడిన ఆయన, ఈ ఉచిత రవాణా సేవలను మరింత మంది వినియోగించుకోవాలని, ఇతర భక్తులకు కూడా సమాచారం అందించాలని



కోరారు. భక్తుల సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఏర్పాటు చేసిన ఈ సేవలకు పోచారం శ్రీనివాసరెడ్డి, ఆలయ కమిటీకి భక్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీర్కూర్ మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, తిమ్మాపూర్ ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# నిజామాబాద్‌లో పీఎం రాహత్ స్కీమ్‌పై అవగాహన వర్క్ షాప్

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :కేంద్ర రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ప్రారంభం కానున్న "పీఎం రాహత్ స్కీమ్" పై నిజామాబాద్‌లోని ఐఎంఏ మీటింగ్ హాల్‌లో శనివారం ప్రత్యేక అవగాహన వర్క్ షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ఆరోగ్యశ్రీ సేవలు అందిస్తున్న ఆసుపత్రుల యాజమాన్యాలు, వైద్యులు, సంబంధిత విభాగాల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏసీపీ మస్తాన్ అలీ, డీఎంహెచ్ఓ రాజశ్రీ మాట్లాడుతూ, ఈ పథకం ద్వారా రోడ్డు ప్రమాద బాధితులకు కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.1.50 లక్షల వరకు లేదా ఏడు రోజుల పాటు ఉచిత వైద్య చికిత్స అందించబడుతుందని తెలిపారు. జిల్లా పరిధిలోని 38 ఆరోగ్యశ్రీ ఆసుపత్రులు ఈ పథకం అమలులో సమన్వయంతో పనిచేసి, బాధితులకు




సమయానికి మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఎటువంటి పొరపాట్లు జరగకుండా ఆసుపత్రులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. వర్క్ షాప్‌లో శిక్షణ అందించిన ఈదార్ మేనేజర్ వర్షా నిహంత్ మాట్లాడుతూ, త్వరలోనే నిజామాబాద్ జిల్లాలో ఈ పథకం అమలులోకి రానుందని తెలిపారు. ఈ స్కీమ్ విజయవంతంగా అమలు కావాలంటే పోలీసు శాఖ, ఆరోగ్య శాఖ పరస్పర సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.
అన్ని శాఖల సహకారంతోనే ఈ కార్యక్రమం ముందుకు సాగుతుందని వివరించారు. టెక్నికల్ పరమైన సహాయ సహకారాల కోసం ఎన్ఐసీ విభాగం ముందుండి పనిచేస్తుందని జిల్లా ఇన్ఫర్మేటిక్స్ అధికారి మధు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డా. విశాల్, జిల్లా కార్యదర్శి సృజన్, జిల్లా ఆరోగ్యశ్రీ మేనేజర్ శశాంక్ రెడ్డి, వివిధ ఆసుపత్రుల ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

# దాన్యం కొనుగోలుకు కేంద్రం నిధులస్తుంటే కొనుగోలుకు, మధ్యవర్తిత్వానికి రాష్ట్ర ప్రభుత్వానికి నొప్పేంటి

## వరి కొనుగోలు కేంద్రాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరి పైన బిజెపి పోరుబాట

## బీజేపీ మండల్ ప్రెసిడెంట్ అరే రవీందర్

భీమ్ గల్, బతుకమ్మ :వరి దాన్యం కొనుగోలుకు కావాల్సిన నిధులను ఎఫ్ సీ ఐ ద్వారా కేంద్ర ప్రభుత్వం చెల్లింపులు చేస్తుంటే, మధ్యవర్తిత్వం తో దాన్యం కొనుగోలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి నొప్పి ఏంటో తెలియడం లేదని బీజేపీ మండల పార్టీ ప్రెసిడెంట్ అరె రవీందర్ ప్రశ్నించారు. శనివారం ఆయన మండల బీజేపీ నాయకులతో కలిసి భీమ్ గల్ మండలం చెంగల్ గ్రామంలోని వరి కొనుగోలు కేంద్రాలను సందర్శించి మాట్లాడారు. కోతలు ముగించుకొని రెండు నెలలు గడుస్తున్న భీమ్ గల్ మండలంలో కల్లాలలో వడ్లు కుప్పల్ కుప్పలుగా ఉన్నాయని, ముఖ్యంగా చెంగల్ గ్రామంలో అయితే రైతులు పంటను తెచ్చి రెండు నెలలు గడిచిన సుమారు 60 లారీల వడ్లు కల్లాల మీదనే ఉన్నాయన్నారు. ఎక్కడికక్కడ పత్రలు కప్పి కుప్పలు తెప్పలుగా పడి ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వంకు రైతుల ఆవేదన చీమకుట్టినట్లు కూడా లేదని, మీడియా లో హైప్ కోసం నిన్న బోధన్ ఎమ్మెల్యే, ప్రభుత్వ సలహాదారు వచ్చి చూసి వెళ్లారన్నారు. కానీ



ఎక్కడి వడ్లు అక్కడే వున్నాయని, ప్రతి గింజ కొనుగోలు చేస్తామని మాట చెబుతున్నారు తప్పితే క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ తీరును రైతుల తరపున మేము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.
రైతులను వివరాలు అడిగి తెలుసుకోగా ఒక్క క్వింటాలుకు 8 కిలోల కడుతా కటింగ్ చేస్తున్నారని,లారీల కోసం ఒక్క 40 కిలోల బస్తాకు రూ.4 లు రైతుల వద్ద ముక్కు పిండి వసూలు చేస్తున్నారన్నారు. అయిన అధికారులు పట్టించుకోవడం లేదని, ఒక మధ్యవర్తి లెక్క ఏజెన్సీ లెక్క ఉండి వడ్ల సేకరించి కేంద్ర ప్రభుత్వానికి అప్పగించే విధానంలో కూడా ఈ రాష్ట్ర ప్రభుత్వం సరిగ్గా పనిచేయకపోతే రైతుల తరపున ఈమాత్రం చేయకపోతే రాష్ట్ర ప్రభుత్వానికి, రైతు సంక్షేమ ప్రభుత్వంగా చెప్పుకునే నాయకులు సిగ్గుపడాల్సి ఉంటుందన్నారు.రాష్ట్ర ప్రభుత్వాన్ని రైతాంగం తరపున బిజెపి తీవ్రంగా హెచ్చరిస్తుందని, ఇలాంటి పరిస్థితులే కొనసాగుతా ఉంటే ప్రజలు మీకు గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు .
ఈ కార్యక్రమంలో కుప్కల్ సర్పంచ్ నర్సింగ్ రావు,చెంగల్ గ్రామ ఉప సర్పంచ్ నాతి మోహన్ గౌడ్,కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు తోట గంగాధర్, బీజేవైఎం మండల అధ్యక్షులు శెట్టి ప్రేమ్ చంద్,సీనియర్ నాయకులు కొట్టాల అశోక్,పురస్తూ దినేష్,బాలయ్య,శ్రీనివాస్,మరియు చెంగల్ గ్రామ రైతులు పాల్గొన్నారు.

# వారంలో 169 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు

## మందు బాబులకు రూ.10.80 లక్షల జరిమానా

నిజామాబాద్ క్రైం, బతుకమ్మునిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో గడిచిన 1 వారంలో డ్రంకన్ డ్రైవ్ కేసులలో 169 మంది పట్టు బడగా ఇందులో ఏడు గురికి వారం రోజుల పాటు జైలు శిక్ష విధించడం జరిగిందని మిగిలిన వారికీ రూ. 10,80,000 జరిమానా విధించినట్లు పోలీస్ కమీషనర్ సాయి చైతన్య తెలిపారు. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్ ఆర్మూర్ బోధన్ డివిజన్ ,ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ సమీపలలో వారి వారి పోలీస్ స్టేషన్ పరిధిలలో వాహనాల తనిఖీలు నిర్వహించడం జరుగుతోందన్నారు. ప్రజలు మద్యం సేవించి వాహనాలు నడపరాదు అని సూచించారు. డ్రంకన్ డ్రైవ్లో పట్టుబడిన వారి లైసెన్స్ 6 నెలల పాటు సస్పెండ్ చేయబడుతుందని అన్నారు.మద్యం త్రాగి వాహనం నడిపి అనుకోని రోడ్ ప్రమాదం జరిగినట్లయితే ఇన్సూరెన్సు లభించదు అని తెలిపారు. మైనర్లు తాగి వాహనం నడిపి పోలీస్ వారికి దొరికినట్లైతే మైనర్ , వెహికల్ ఓనర్ పైన ఛార్జ్ షీట్ నమోదు చేయబడును అలాగే జైలు శిక్ష విధించే అవకాశం కలదు అని తెలిపారు. ఒక సారి కంటే ఎక్కువ సార్లు పట్టుబడినట్లయితే జైలు శిక్ష విధించబడును అని పేర్కొన్నారు. మోటర్ వెహికల్ యాక్ట్ 1989 (చట్టం సవరణ - 2019) అమలులో ఉన్నందున డ్రంక్ అండ్ డ్రైవ్ లో మొదటిసారి పట్టుబడినట్లయితే 10,000/- జరిమానా లేదా ఆరు నెలల జైలు శిక్ష లేదా జరిమానా తో పాటు జైలు శిక్ష విధించబడును. అలాగే డ్రంక్ అండ్ డ్రైవ్ లో రెండోసారి పట్టుబడినట్లైతే 15,000/- జరిమానా లేదా జైలు శిక్ష లేదా జైలు శిక్షతో పాటు జరిమానా విధించబడునని కమీషనర్ సాయి చైతన్య తెలిపారు.


# సూపర్ బ్రెయిన్ యోగాపై అవగాహన కార్యక్రమం



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :నిజామాబాదు నగరం లోని పి యమ్ శ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కోటగల్లి (శంకర్ భవన్) లో నిర్వ హింపబడుతున్న విద్యార్థుల వేసవి శిభిరంలో "సూపర్ బ్రెయిన్ యోగా" అనే అంశంపై గుంజీళ్ళ అంతర్జాతీయ ప్రచారకులు అందె జీవన్ రావు కార్య శాల నిర్వహించినారు. క్రమ పద్ధతిలో సూపర్ బ్రెయిన్ యోగ చేయడం ద్వారా జ్ఞాపకశక్తి పెరుగుతుందనీ తాజా పరిశోధనలు తెలియ జేస్తున్నా యని , ఆ పరిశోధనా వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు వివరించినారు. సూపర్ బ్రెయిన్ యోగా చేయడం వలన జ్ఞాపక శక్తి, ఏకాగ్రత, మెరుగైన శ్రద్ధ, సమస్యా పరిష్కారం, అభ్య సనం, గుర్తుంచుకోవడం, సృజనాత్మకత, మానసిక పెరుగుదల, మాన సిక సమతుల్యత మొదలైనవి పెంపొంది సమస్యలు మరియు ఆందో ళనల నుండి ఉపశమనం కలుగుతుందని తెలిపినారు. కార్యక్రమంలో భా గంగా విద్యార్థులచే 14 రౌండ్లు సూపర్ బ్రెయిన్ యోగా చేయిం చినా రు. తాను అంతర్జాతీయ సదస్సులో సూపర్ బ్రెయిన్ యోగా అం శంపై సమర్పించిన పరిశోధన పత్రాల ప్రతులను పాఠశాల ప్రధానో పాధ్యా యులు సాయన్న నకు అందజేసినారు.కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి గంగా కిషన్ తదితరులు పాల్గొన్నారు.

# గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కలకలం

నిజామాబాద్ క్రైం, బతుకమ్మ :నిజామాబాద్ జిల్లా దుబ్బ ప్రాంతంలోని కే ఎస్ పి వైన్స్ సమీపంలో కాలూరు రోడ్ పక్కన ఉన్న ఓపెన్ ల్యాండ్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన స్థానికంగా కలకలం రేపింది. శనివారం ఉదయం స్థానికులు మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న 3 టౌన్ పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడు సుమారు 40 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తిగా పోలీసులు భావిస్తున్నారు. మృతదేహం కొంతవరకు కుళ్లిపోయిన స్థితిలో ఉన్నట్లు గుర్తించారు.మృతదేహంపై బ్రౌన్ రంగు డ్రాయర్ మాత్రమే ఉండగా, సమీపంలో నలుపు-తెలుపు చెక్స్ ఫుల్ షర్ట్ మరియు బూడిద రంగు జీన్స్ ప్యాంటు లభ్యమయ్యాయి. మృతుడి ఎత్తు సుమారుగా 5.6 అడుగులు ఉండగా, నడుముకు ఎరుపు-నలుపు రంగుల మొలదారాలు, కుడిచేతి మణికట్టుకు ఎరుపు, పసుపు రంగుల కంకణాల దారం ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై 3 టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి పంచనామా నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించి భద్రపరిచారు. మృతుడి వివరాలు తెలిసిన వారు నిజామాబాద్ టౌన్-III పోలీస్ స్టేషన్‌ను కానీ, సీఐ ఁ ఎస్సై - 8712659836, 8712659839, పోలీస్ స్టేషన్ - 8712659717 నంబర్ లని కానీ సంప్రదించాలని పోలీసులు కోరారు.





# చౌడేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు

## నేడు అమ్మవారి శోభయాత్ర

రుద్రూర్, బతుకమ్మ :రుద్రూర్ మండల కేంద్రంలోని రామలింగ చౌడేశ్వరి మాత ఆలయంలో కళ్యాణ మహోత్సవ వేడుకలు శనివారం ఘనంగా ప్రారంభమ య్యాయి. రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఈ ఉత్సవాల్లో భాగంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. అమ్మవారికి ప్రత్యేక నైవేద్యాలు సమర్పించడంతో పాటు భజనలు, కీర్తనలు, పట్టు మహోత్సవ కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో కొనసాగాయి. ఆలయం పరిసరాలు విద్యుత్ దీపాలతో అలంకరించి ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించారు. ఆదివారం ఉదయం దేవి శోభాయాత్ర నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం భక్తుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని కూడా ఏర్పాటు చేసినట్లు వారు పేర్కొన్నారు.

